కాలిబాటలతో అధిక లాభం

- ఆరోగ్యంగా పైరు ఎదుగుదల
- చీడపీడల తగ్గుదల
- రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు



కె.పెదపూడిలో కాలిబాటలతో రైతులు వేసిన వరి నాట్లు

అంబాజీపేట: వరి చేను ఊడ్చిన తరువాత పొలంలో ప్రతి రెండు మీటర్లకు కాలిబాట వేయడం వలన రైతులకు అధిక ప్రయోజనం ఉంటుంది. పైరు వేరు భాగానికి విస్తారంగా గాలి, సూర్యరశ్మి తగలడం, చీడపీడల సమస్య తగ్గడం, ఎరువులు, పురుగుమందులు చల్లే సమయంలో దారి సమస్య తగ్గడంతో పాటు ప్రతి ఎకరాకు మూడు, నాలుగు బస్తాలు అదనంగా పండి రైతులకు లాభాన్ని కలగజేస్తుంది. దారితో పాటు ప్రతి ఎకరాకు గతంలో చాలా మంది రైతులు కాలిబాటలు వేయడం అదనపు ఖర్చుగా భావించి ఆసక్తి కనబరిచే వారు కాదు. వ్యవసాయాధికారులు కాలిబాటల ప్రయోజనాన్ని రైతులకు విస్తృతంగా వివరించడంతో రైతులంతా కాలిబాటలు వేస్తున్నారు. సుమారుగా అయినవిల్లిలో 8,186, అంబాజీపేటలో 3,095, పి.గన్నవరంలో 5,780, మామిడికుదురులో 1,621, రాజోలు 820, సఖినేటిపల్లిలో 54, మలికిపురంలో 232, ఆత్రేయపురంలో 4,787, ఆలమూరులో 9,900, రావులపాలెంలో 4,614, కొత్తపేటలో 7,813 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. కాలిబాటలు వేసే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. ప్లాస్టిక్ లేదా డొక్కతాడు తీసుకుని గట్టు అవతలి వైపు నుంచి ఇవతలి వైపు వరకు బాగా సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12 సెంటీమీటర్ల వెడల్పున వరి నాట్లు సాగులో ఉన్న వరిచేను తొలగించి పక్కనే పలచగా ఉన్న ప్రదేశంలో నాటుకోవాలి. వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తే విత్తనాలు చల్లిన తరువాత 15 నుంచి 20 రోజుల వ్యవధిలో కాలిబాటలు వేసుకోవాలి.

ప్రయోజనాలెన్నో..

కాలిబాట వేయడం వలన వేరు మొదళ్లకు గాలి, వెలుతురు, సూర్యరశ్మి విస్తారంగా తగులుతుంది. దీంతో పైరు ఆరోగ్యంగా ఎదుగుతుంది. చీడపీడల బెడద కొంతవరకు తగ్గుతుంది. కాలిబాట మార్గంలో వెళ్లి కలుపు తొలగించడానికి, మందులు చల్లడానికి వీలు కలుగుతుంది. తెగుళ్లను సులభంగా గుర్తించడానికి, సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి ఎలుకల నివారణకు వీలవుతుంది. తుపాన్లు, భారీ వర్షాలు వంటి ప్రకృతి విపత్తులు ఏర్పడిన సమయంలో పైరులో కిరణజన్య సంయోగక్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి తగ్గకుండా ఉంటుంది. పైరులో చీడపీడల ఉధృతిని దగ్గరగా గమనించి, దానికి అనుగుణంగా సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది.

> **అధిక దిగుబడులకు ఆస్కారం**
>
> 
>
> ఒక ఎకరం పొలంలో కాలిబాటలు వేయడానికి సుమారు రూ.800 ఖర్చు అవుతుంది. కాని కాలిబాటలు వేయడం వల్ల నాలుగు బస్తాల వరకు అధిక దిగుబడి రావడమే కాకుండా పంట కాలంలో చేను మొత్తం తిరగడానికి అనువుగా ఉంటుంది. దీనిపై మా సిబ్బందితో రైతులకు అవగాహన కల్పించడంతో ఇప్పుడు రైతులంతా కాలిబాటలు వేస్తున్నారు.
>
> – ఎస్‌జేవీ రామమోహనరావు, ఏడీఏ, పి.గన్నవరం

పేదలకు అండగా జగన్ సర్కారు



తాటిపాకకు చెందిన సోనీకి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

మామిడికుదురు: నిరుపేదలకు సీఎం జగన్ సర్కారు ఎల్లవేళలా అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పేర్కొన్నారు. సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.రెండు లక్షల చెక్కును ఎమ్మెల్సీ ఆదివారం రాజోలు మండలం తాటిపాకకు చెందిన బాలం సోనీకి అందించారు. 2006లో భవనంపై బట్టలు ఆరేస్తూ సోనీ విద్యుత్ షాక్‌కు గురై ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతుంది. సోనీ ఆర్థిక పరిస్థితిని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ఇటీవల అమలాపురం వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన సీఎం జగన్ ఆమెకు రూ.రెండు లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారని చెప్పారు. సీఎం మంజూరు చేసిన సహాయాన్ని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ బాధితురాలు సోనీకి అందించారు. ఆమెకు ఉపాధి కూడా చూపించాలని సీఎం కలెక్టర్‌ను ఆదేశించారని ఎమ్మెల్సీ చెప్పారు.

క్లుప్తంగా

మండల ప్రజలకు పోలీస్ శాఖ విజ్ఞప్తి

అయినవిల్లి: అయినవిల్లి **పోలీస్ స్టేషన్** పరిధిలో ఉన్న గ్రామాల్లో **తరచుగా దొంగతనాలు** జరుగుతున్నాయి. **కావున ప్రజలంతా** అప్రమత్తంగా ఉండాలని **అలాగే వీలైనంత** వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మంచిదని, ప్రజలందరూ ఒక్కటై ఈ దొంగతనాలు అరికట్టేలా అడుగు వేయాలని అయినవిల్లి ఎస్సై ఎస్.నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎవరైనా ఇల్లు వదిలి కొన్ని రోజులు బయటికి వెళ్లే ఉద్దేశముంటే వెంటనే సమీపాన పోలీస్టేషన్‌కి లేదా గ్రామ సచివాలయం మహిళా పోలీస్‌కు సమాచారం ఇచ్చి వెళ్లాలని సూచించారు. అలాగే దొంగతనాల విషయంలో ఎవరి మీదయినా మీకు అనుమానం ఉంటే తక్షణమే పోలీసు వారికి సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

నగరం ఎస్సైని కలసిన నేతలు

మామిడికుదురు: నగరం ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పి.సురేష్‌ను వైఎస్సార్ సీపీ నేతలు ఆదివారం కలసి అభినందనలు తెలిపారు. ఎస్సైకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఎస్సైను కలసిన వారిలో వైఎస్సార్ సీపీ గ్రామశాఖల సమాఖ్య అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్ ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు గెద్దం వెంకటేశ్వరరావు, అప్పన రామకృష్ణ, వాకపల్లి రాంబాబు తదితరులు కూడా ఎస్సైను కలసి అభినందనలు తెలిపారు.

ర్యాలి ఆలయ అభివృద్ధికి విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన మిరియంపల్లి శ్రీధర్ రూ.15,232, బెంగళూరుకు చెందిన వాసా శ్రీనివాసరావు రూ.5,116 విరాళం అందించినట్లు ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. దాతకు సిబ్బంది స్వామి చిత్రపటం అందజేశారు.

అలీ అస్గర్‌కు ముస్లింల నివాళి



నగరంలో ఊయల ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: షియా మతస్తుల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్ తనయుడు ఆరు నెలల పసికందు షహజాదే అలీ అస్గర్‌కు ముస్లింలు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. నగరం గ్రామంలోని మొల్లా పంజా నుంచి అలీ అస్గర్ ఊయలను తీసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. సజ్జాద్‌హుస్సేన్ సాజిద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. మత ప్రబోధకుడు అబ్బాస్ బాఖరి మజ్లిస్ ఆలపించారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నగరం పెద పంజీషా వరకు ఊయల ఊరేగింపు జరిగింది. ఊయల ఊరేగింపులో గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహిస్తూ అలీ అస్గర్‌కు నివాళులర్పించారు. సాజిద్, గుల్షన్‌ల ఆధ్వర్యంలో మాతం జరిగింది.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన పి.కల్యాణ్‌రెడ్డి, కేఆర్‌వీకే మహాలక్ష్మి దంపతులు రూ.31,116, అనపర్తికి చెందిన కె.మణికంఠరెడ్డి రూ.25 వేల విరాళం అందించినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతలకు ఈఓ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు

అమలాపురం టౌన్: స్థానిక విశ్వ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో పవర్ కిక్ షోటోకాన్ కరాటేడు అసోసియేషన్ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ పరీక్షా పోటీలు ఆదివారం జరిగాయి. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో కరాటే విద్యార్థులు బెల్ట్ గ్రేడింగ్ కోసం నువ్వా నేనా అన్నట్లుగా ప్రతిభ చాటారు. పోటీలకు హాజరైన విద్యార్థులకు కరాటే చీఫ్ కోచ్ పడాల అంజి ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అంజితోపాటు కోచ్ చిక్కం సురేష్‌లు విజేతలకు బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు.

రాజ్‌నివాస్ న్యూ కాంప్లెక్స్‌కు మార్పు

యానాం: ఎంతో చరిత్ర ఉన్న పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ నివాసమైన రాజ్‌నివాస్‌గా చరిత్రకెక్కి గ్రేడ్ 1ఏ హెరిటేజ్ వారసత్వ భవనం నిర్మించి వందేళ్లు అవుతోంది. ఈ నేపథ్యంలో పీడబ్ల్యూడీ అధికారులు నివేదిక ప్రకారం దానిని మూసివేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. రాజ్‌నివాస్‌లోనే పుదుచ్చేరి లెఫ్టినెంట్‌గవర్నర్ నివాసంతో పాటు ఆఫీసు కార్యాలయం సైతం ఉండేది. అయితే ప్రస్తుతం రాజ్‌నివాస్ భవనానికి మరమ్మతులు చేసే వరకు ఒక ఏడాది పాటు ఎల్జీ కార్యాలయాన్ని బీచ్‌రోడ్డులోని వైధికుప్పం పక్కన ఓల్డ్ డిస్టలరీ కాంప్లెక్స్ కొత్తగా నిర్మించిన భవనంలోకి మారుస్తున్నట్టు తెలిపారు.

దశల వారీగా సమస్యల పరిష్కారం



గోగన్నమఠంలో ఎమ్మెల్యే వరప్రసాదరావుకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామ పరిధిలోని తోటమెరకలో ఆదివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా ముందుకు వెళ్తున్నామన్నారు. రాష్ట్రం కోసం ఎంతో శ్రమిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. గ్రామంలోని 27 మంది వలంటీర్లను ఎమ్మెల్యే సత్కరించారు. వలంటీర్లకు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా వలంటీర్లు పని చేస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ సీనియర్ నేత భూపతిరాజు సత్తిబాబురాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీలు మట్టా శైలజ, కశిరెడ్డి అంజిబాబు, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, పీఏసీఎస్ చైర్మన్లు సాగి పీఆర్ వీఎస్ఎస్ నర్సింహవర్మ (బాబు), బొలిశెట్టి భగవాన్, మాజీ చైర్మన్ ముత్యాల శ్రీనివాసరావు, సర్పంచ్ అల్లు విజయలక్ష్మి, గ్రామశాఖ అధ్యక్షుడు సాగి సత్యనారాయణ రాజు, పార్టీ నేతలు రాపాక వెంకట్‌రామ్, సూరిశెట్టి బాబి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్ జయంతి



మామిడికుదురులో రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

పి.గన్నవరం: భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి, నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ

మామిడికుదురులో..

మామిడికుదురు: మాజీ ప్రధాని రాజీవ్ జయంతిని పురస్కరించుకుని స్థానిక బస్టాండ్ కూడలిలో ఉన్న విగ్రహానికి కాంగ్రెస్ నేతలు ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమైనవని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గెద్దం వెంకటేశ్వరరావు శ్లాఘించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: మాజీ ప్రధాని రాజీవ్ జయంతిని కొత్తపేటలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుడు ముషిణి రామకృష్ణారావు ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: దేశంలో సాంకేతిక ప్రగతికి రాజీవ్ సంస్కరణలే కారణమని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నెల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో అంబాజీపేట బస్టాండ్ వద్ద జయంతిని నిర్వహించారు. రాజీవ్ విగ్రహానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

కొత్తపేట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నాలుగు అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు సీడీపీఓ పి.శారద తెలిపారు. ఆ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలమూరు మండలం పెదపళ్ల అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ జనరల్) పోస్టుతో పాటు రావులపాలెం మండలం ఈతకోట గొడ రామాలయం (బీసీ–డీ), రావులపాలెం శెట్టిబలిజ ప్రాంతం (ఓసీ జనరల్), ఆత్రేయపురం మండలం అంకంపాలెం పంచాయతీ (ఎస్సీ) అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు అభ్యర్థుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు తెలిపారు. పై పోస్టులకు కనీస విద్యార్హత పదో తరగతి ఉత్తీర్ణులై, స్థానికులైన వివాహిత మహిళలు, ఈ ఏడాది జూలై 1 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు ఉండాలి. అప్లికేషన్‌తో పాటు పదో తరగతి పాస్, కుల, ఆధార్, రేషన్ కార్డు, జనరల్ అయితే నేటివిటీ జెరాక్స్ కాపీలు గెజిటెడ్ అధికారితో అటస్టేషన్ చేయించి, ఫొటో జతచేసి, ఈ నెల 31 సాయంత్రం 5 గంటల లోపు (ప్రభుత్వ పనిదినాల్లో) సమగ్ర శిశు అభివృద్ధి అధికారి, ఐసీడీఎస్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం కాంపౌండ్, కొత్తపేటలో అందజేయాలని సూచించారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



సఖినేటిపల్లిలో కెమెరా సృష్టికర్త డాగూరే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్

సఖినేటిపల్లి: మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో ఆదివారం ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఫొటోగ్రాఫర్స్ నిర్వహించారు. మండల ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సారథ్యంలో తొలుత జెండాను కూడలిలో ఎగురవేశారు. అనంతరం కెమెరా సృష్టి కర్త లూయిస్ డాగూరే చిత్ర పటానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు నల్లి మీనన్ మాట్లాడుతూ, తోటి ఫొటోగ్రాఫర్స్ ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే ఆర్థిక సాయం చేయడంతో పాటు, వారికి అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ జన్ని, శేఖర్, వెంకటేష్, చిన్ని లైవ్, కిషోర్, రాజేష్, కిరణ్మయి, ఆకుల శ్రీను, సుబ్బు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాణ్యమైన మత్స్య ఉత్పత్తులే లక్ష్యం

తాళ్లరేవు: వినియోగదారులకు నాణ్యమైన మత్స్య ఉత్పత్తులను తక్కువ ధరలకు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఫిష్ ఆంధ్రా మినీ రిటైల్ అవుట్‌లెట్లను ఏర్పాటు చేస్తోందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. ఆదివారం స్థానిక చెరువుగట్టు సెంటర్‌లో రచ్చా పద్మ ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా మినీ రిటైల్ అవుట్‌లెట్‌ను ఆమె ప్రారంభించారు. ప్రజలకు తాజా చేపలు, రొయ్యలు తదితర వాటిని నాణ్యతతో అందించేందుకు ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఫిషరీస్ ఏడీ లావణ్య, ఎఫ్‌డీఓ జి.గోపి, ఎంపీటీసీ సభ్యుడు రచ్చా ముత్యాలు, నాయకులు రాయుడు గంగాధర్, రెడ్డి రెడ్డిబాబు, నందికోళ్ల శ్రీమన్నారాయణ, కొల్లు శ్రీను, విత్తనాల రామకృష్ణ, బొంతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వినియోగదారులకు చేపలను అందజేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత

వార్డు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం

కొత్తపేట: పంచాయతీ వార్డు ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు సత్తా చాటారు.



కొవ్వూరి సాయిలక్ష్మి
ఊబలంక 3వ వార్డు, రావులపాలెం మండలం (మెజారిటీ 123 ఓట్లు)



పోతిరెడ్డి సురేష్
నార్కెడిమిల్లి 6వ వార్డు, ఆత్రేయపురం మండలం (ఏకగ్రీవం)

ఎమ్మెల్యేని సత్కరించిన వార్డు సభ్యుడు



వార్డు సభ్యుడు వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: మాచవరం పంచాయతీ 13వ వార్డు ఉప ఎన్నికల్లో గెలుపొందిన మట్టపర్తి వెంకటేశ్వరరావు పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును ఆదివారం మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు. ప్రతిగా వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, అంబాజీపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి అష్టోత్తర పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు తమ కోర్కెలు నెరవేరడంతో స్వామి వారి అష్టోత్తర పూజల్లో అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతర స్వామి వారి నిత్య కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు. ఈనెల 26 నుంచి జరిగే పవిత్రోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ తెలిపారు.

సర్పంచ్‌కు పరామర్శ

అంబాజీపేట: ఇటీవల పాము కాటుకుగురై అమలాపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాకలగరువు సర్పంచ్ మద్దింశెట్టి దొరబాబును ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి, తొండవరం సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు ఆదివారం పరామర్శించారు. దొరబాబు ఆరోగ్య, యోగ క్షేమాలను అక్కడి వైద్యులను అడిగి తెలుసుకుని, ఆయనకు మనోధైర్యం కల్పించారు. నాగాబత్తుల సుబ్బారావు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

బీఎస్పీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా త్రిమూర్తులు

అమలాపురం టౌన్: జిల్లా బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) కార్యనిర్వాహక కార్యదర్శిగా కోలా త్రిమూర్తులు నియమితులయ్యారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులోని వెంకటేశ్వర ప్లాజాలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్య చింతా అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో త్రిమూర్తులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. త్రిమూర్తులను జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించినట్టు జిల్లా అధ్యక్షుడు సత్య ప్రకటించారు. జిల్లా పార్టీ నాయకులు కాంబ్రేగుల నరసింహం, కాశి లక్ష్మీ భవాని, వాకపల్లి భీమారావు, కుసుమ వెంకటేశ్వరరావు, సాకా రాజారావు, పెండల శ్రీనివాస్, బడుగు భీమేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

నియోజకవర్గ ప్రజాదరణ జగ్గిరెడ్డికే..



కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతున్న అముడా చైర్మన్ డేవిడ్‌రాజు, ఎంపీపీ గంగాధరరావు తదితరులు

కొత్తపేట: ఎప్పటికీ నియోజకవర్గ ప్రజాదరణ చిర్ల జగ్గిరెడ్డికే పదిలమని వైఎస్సార్ సీపీ నాయకులు ధీమా వెలిబుచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి విలేకరులతో మాట్లాడారు. జనసేన నాయకులు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ భుజాలు తడుముకున్నారని ఎద్దేవా చేశారు. 2024లో వైఎస్సార్ సీపీ గెలిచే మొదటి నియోజకవర్గం పులివెందుల అయితే రెండో నియోజకవర్గం కొత్తపేట అన్నదానికి జనసేన నాయకులు పెడార్థాలు తీస్తూ మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. జగ్గిరెడ్డి దమ్ము ఏంటో 20 సంవత్సరాలుగా నియోజకవర్గం చూస్తూనే ఉందన్నారు. ప్రజాసేవే పరమావధిగా నిత్యం ప్రజల్లో ఉంటూ, ప్రజాసేవ చేస్తూ, ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు వెళుతున్నారన్నారు. ఒక మైనార్టీ సంఖ్యాక వర్గానికి చెందిన నాయకుడు అయినప్పటికీ ప్రజల మనస్సులో సుస్థిర స్థానం పొంది, ప్రజాదరణతో వరుస విజయాలు సాధిస్తున్న మకుటం లేని మహారాజు, దమ్మున్న నాయకుడని అన్నారు. నారాహి యాత్ర చేస్తున్న పవన్‌కల్యాణ్ కొత్తపేట నియోజకవర్గం రాకపోవడం, నా భవిష్యత్‌కు మీరు గ్యారంటీ అని నారా చంద్రబాబునాయుడు కొత్తపేట నియోజకవర్గంలో పర్యటించడం దేనికి సంకేతమో జనసేన నాయకులు తెలుసుకోవాలని, అసలు మీకు టిక్కెట్ ఉందో లేదో తెలియని నాయకులు జగ్గిరెడ్డిపై అవాకులు, చవాకులు మాట్లాడటం సరికాదని హితవు పలికారు. వాపో, బలుపో, గెలుపో 2024లో చూపిస్తాం.. చూస్తూ ఉండండి అని వారు అన్నారు. సమావేశంలో మండల సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్ కుమార్, ఎంపీటీసీలు విళ్ల వీర్రాజు, నేలపూడి భీమరాజు, ముళ్ల జనార్దన్, దూళి సూరిబాబు, హెచ్‌డీసీ సభ్యుడు పల్లి దిలీప్, మాజీ సర్పంచ్ పితాని రాంబాబు, ఖండ్రిగ డీఎస్, జబీహెచ్ పీఎంసీ చైర్మన్ బీర శ్రీనివాసరావు, మాగాపు రవికుమార్, బెజవాడ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనలో భాగస్వాములవ్వాలి



మొగలికుదురులో వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ

మామిడికుదురు: ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. దోమల నివారణ పద్ధతులను వివరిస్తూ నినాదాలు చేశారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులు, లార్వా నిర్మూలన చర్యలు, దోమ తెరల వాడకం, దోమల మందు పిచికారీ చేయించడం, వ్యాధి నిర్ధారణ, సరైన చికిత్స తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మొగలికుదురులో జరిగిన ర్యాలీలో నగరం పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, ఏఎన్ఎం మల్లీశ్వరి, ఆశ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

మోటార్ వాహనాల ప్రమాదాలపై అవగాహన



ట్రిపుల్ రైడింగ్‌పై యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ గోవిందరాజు

రాజోలు: మోటార్ వాహనాల ప్రమాదాలపై ద్విచక్ర వాహనదారులకు రాజోలు సీఐ గోవిందరాజు ఆదివారం అవగాహన కల్పించారు. ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న యువకులను నిలుపుదల చేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రస్తుతం దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్న దృష్ట్యా దూర ప్రయాణాలకు వెళ్లే యజమానులు ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రయాణాలకు వెళ్లే వారు అధిక నగదు, బంగారు వస్తువులను బ్యాంకు లాకర్లలో డిపాజిట్ చేసుకోవాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు, అనుమానితులు సంచరిస్తే వెంటనే ఆ సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు.

శ్మశాన వాటిక స్థల సమస్య పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీయూ డబ్ల్యూఏ అధ్యక్షుడు పెయ్యల రమేష్ తదితరులు

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ పరిధిలోని బాబానగర్ గ్రామానికి సంబంధించి శ్మశానవాటిక స్థల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎండీయూ డబ్ల్యూఏ అధ్యక్షుడు పెయ్యల రమేష్, బీఎస్పీ ప్రతినిధులు వాకపల్లి భీమారావు, మాత సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం బాబానగర్‌లో ప్రభుత్వం కేటాయించిన శ్మశాన వాటిక స్థలాన్ని వారు పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బాబానగర్ గ్రామవాసులకు శ్మశానం లేకపోవడం దారుణమన్నారు. ఇటీవల ప్రజలు కోరిక మేరకు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఉపపయోగించుకునేందుకు అధికారులు అనుమతించడం అభినందనీయమన్నారు. అయితే గాడిమొగకు చెందిన గ్రామస్తులు అభ్యంతరాలు తెలపకుండా ఆయా శ్మశాన స్థలాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేసి గ్రామానికి దాఖలు చేయాలని కోరారని, ఆ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీయూ డబ్ల్యూఏ ఉపాధ్యక్షుడు మోకా దుర్గాప్రసాద్, కార్యదర్శి తాడి షణ్ముఖరాజు, బీఎస్పీ నాయకులు కమిడి శ్రీను, కుసుమ శ్రీనివాస్, దడాల శ్రీనివాస్, మోర్త విజయ్ గల్లా చందు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌డీసీ పరీక్షకు ఏర్పాట్లు

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎల్‌డీసీ, స్టోర్ కీపర్ పోస్టుల భర్తీకి ఈ నెల 27న నిర్వహించే పోటీ పరీక్షకు ఏర్పాట్లు చేసినట్లు ఆదివారం పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి వ్యాప్తంగా 137 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. యానాంలో 10, మాహేలో 6, కారైకల్‌లో 14, పుదుచ్చేరిలో 107 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హాల్‌టికెట్లను 'రిక్రూట్‌మెంట్.పీవై.జీఓవీ.' నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 0413-2233338 నంబరుకు అన్ని పని వేళల్లో ఫోన్ చేయవచ్చునని పేర్కొన్నారు